# విరక్తి - విముక్తి

రచన:
శ్రీ నాగభూషణం రావు

సాయంత్రం ఆఫీసు అయిపోయింతర్వాత పార్కులోకి ప్రవేశించాము నేను మరికొందరు మిత్రులు. అంతా ఏకగ్రీవంగా తీర్మానించుకున్నమీదట హోటల్ 'వూటీ' లో ప్రవేశించి కాస్త కాఫీత్రాగి బయటపడ్డాం. తరువాత చల్లని పిల్లవాయువులతో మనస్సుకు కొంత హాయి నిద్దామని 'హెల్త్ మ్యూజియం' వైపు బయలుదేరాం. అప్పటికి హెల్త్ మ్యూజియం కెదురుగా బూరుగదూది పరుపులా పరుచుకొనివున్న పచ్చని పచ్చికలో చాలా మంది కూర్చునివున్నారు. మ్యూజియంవాళ్లు వేస్తున్న రికార్డులు వింటూ మహదానందం కొందరు పొందుతుంటే మరికొందరు ఏవేవో మాట్లాడుకుంటూ ఆనందిస్తున్నారు. పోతే అక్కడి కొచ్చిన వ్యక్తులగురించి విచిత్రాభిప్రాయాలు ప్రకటించుకొంటూ కేరింతాలుకొడ్తున్న కుర్రవాళ్లుగూడా లేకపోలేదు.

అప్రయత్నంగా మా కాళ్లుగూడా అదే దారి తీసాయి. 'అజంతా పెవెలియన్' దగ్గర జనం తక్కువగా కన్పించడంతో అక్కడికివెళ్ళి కూర్చున్నాం. మ్యూజియం రికార్డులతో ప్రారంభమైన మా సంభాషణ ఆఫీసులు, ఆఫీసర్లవగైరాలవరకూ వచ్చింది. ఆఫీసర్లు-గుమాస్తాలు ఎలా పని చేస్తున్నారు? వారికి రెస్టు కావాలా, అక్కరలేదా? అనేది ఆలోచించకుండా ఆదివారాలు తదితర సెలవుదినాలు గుమస్తాలను ఆఫీసుకు రమ్మనడం గురించి వుపన్యాసాలధోరణిలో మాట్లాడుతున్నాడు చంద్రం. ఇంతలో ఎటునుంచో 'సార్!' అనీ విన్పించింది. కానీ మేము మాధోరణి మారలేదు.

'సార్'...మళ్ళీ విన్పించింది.

నేను తల పైకెత్తాను. ఎవరో యువకుడు నిలబడివున్నాడు. చేతిలో ఏవో కాగితాలున్నాయి. మురికి గుడ్డలు, మాసినగడ్డం, మనిషి నీరసంగా వున్నట్టు అగపడ్తున్నాడు.

'సార్...' నేను తల ఎత్తడాన్ని గమనించి అతను ఏదో చెప్పడానికి ప్రారంభించాడు.

'సార్ లేదు గీర్ లేదు, పో పో' అన్నాడు చంద్రం తన వుపన్యాసాన్ని ఆపి.

'సార్...ఒక్క...' అతను మళ్ళీ చెప్పడానికి ప్రయత్నించాడు.

'ఆఁ...ఒక్క నయాపైసా అన్నా యివ్వమంటావు. అంతేగా?' చంద్రం సింహంలా గర్జించాడు.

'అదిగాదుసార్...'

'మరేమిటి?' దిక్కులేని పేద విద్యార్థిని, కొంచెం సహాయం చెయ్యమంటావు' ఏం, అవునా? అడుక్కుతినే ప్రతివాడికీ యిదొక వేషం దొరికింది' వీర్రాజు విసుక్కున్నాడు.

అతనిముఖం వెలవెలబోయింది. అప్పటివరకూవున్న ఆ కొద్ది జీవకళగూడా హారతి కర్పూరంలా హరించిపోయింది. అతను అడుక్కునేవాడు గాదని తెలుసుకునేందికి నాకెంతో సమయం పట్టలేదు. అతను చెప్పదలచుకున్నదేదో చెప్పమందామని నోరు తెరిచానో లేదో 'నువ్వు నోరు మూసుకో వాసూ! అడ్డమయినవాళ్ళందరికీ సహాయంచేస్తూ కూర్చుంటే మనపని అయినట్లే! రేపు మనంగూడా యింటింటికీ పోవాలసినగతి పడుతుంది' చంద్రం, వీర్రాజు, కుమార్ మొదలయినవాళ్ళంతా నామీద విరుచుకుపడ్డారు. నేను నోరు మూసుకోక తప్పిందిగాదు. వాళ్ళమాటలు వినలేక ఆ యువకుడు నిరాశతో వెనక్కి తిరిగాడు. తడబడుతున్న అడుగులలో అతను వెల్తుంటే అతను మరుగయ్యేదాకా చూసాను.

తర్వాత చంద్రం, వీర్రాజు, కుమార్ ఏవేవో మాట్లాడారు. కానీ వినడానికి మనస్కరించలేదు. మనస్సు ఎందుకో బరువుతో చాల బాధపడింది. అలాగే తొమ్మిదింటిదాకా కూర్చుని ఎవరిళ్ళకి వాళ్లు వెళ్ళాం.

♦ ♦ ♦

కొన్నాళ్ళ తర్వాత—

ఒకనాడు నేను చంద్రం, కుమార్ కోసం మౌంట్ రోడ్ దగ్గర ఎదురుచూస్తున్నాను. ఎంత సేపటికీ వాడు రాకపోయేసరికి అక్కడికి కాస్త దూరానగల తురాయి చెట్టుక్రింద అమర్చివున్న సిమెంటుబల్లమీద కూర్చున్నాను. చల్లని మలయపవనం వీస్తోంది. కార్లు, టాక్సీలు, ట్రాన్స్‌పోర్ట్ బస్సులు, రణగొణధ్వని చేస్తూ పోతున్నా

యి. కొందరు సైకిళ్ళమీద పోతూ, చల్లగాలి చక్కిలిగింతలకు నవ్వుకుంటూ, పరుటాలర్లు పైకి లాక్కొంటున్నారు, ఆ విచిత్రదృశ్యాన్ని చూస్తూ కూర్చున్నాను. ఇంతలో నాకు కొంచందూరంలో నున్న బస్ స్టాప్‌లో మేరుపర్వతంలాంటి రెండంతస్తులబస్సు ఆగటంతో ఆ వైపు చూసాను చంద్రంవాళ్ళు వస్తున్నారేమో నని. వాళ్లు రాలేదు. కానీ నాదృష్టి ఆ స్టాప్‌కి కుడిపక్కగా కొంచెం దూరంలోనున్న బెంచిమీద కూర్చున్న వ్యక్తిమీద పడింది.

అతన్నెక్కడో, ఎప్పుడో చూసినట్లు మనసు చెబుతోంది. అతని వాడిపోయిన ముఖం, నిరాశతో నిర్జీవమై కాంతివిహీనమయిన కళ్లు, నీరసించి కుష్కించిన దేహం కనులముందు లీలగా కన్పించింది. ఎలాగో విశ్వప్రయత్నంచేసి, పాతదృశ్యాలను మనసులో ఒక్కసారి మననం చేసుకున్నమీదట ఆరూపం గుర్తుకొచ్చింది. అది కొన్నాళ్ళక్రితం పార్కులో కన్పించి చంద్రం, వీర్రాజులచేత అవమానంపొంది, నిరాశతో బాధగా కదిలిపోయినవ్యక్తి. జాలిగొలిపే నేత్రాలతో ఆనాటి నా అవమర్ధతకు జాలిపడి కదలిపోయిన కారుణ్యమూర్తి. అప్రయత్నంగా అశ్రువర్షం కురిసింది నా నేత్రాలనుండి. అతనిదగ్గరకెళ్ళి ఆనాటి నా అశక్తతకు క్షమాపణ కోరుకొని, ఇప్పటికయినా అతనికథ విని చేయవలసిన సహాయం చేయమని మనసు పదేపదే బోధించింది.

అతనిదగ్గరకెళ్ళి క్షమాపణ కోరదామని లేచి రెండడుగులు వేశానో, లేదో ఆకాశంనుండివూడిపడ్డట్లు చంద్రం, కుమార్ టాక్సీలోనుండి బయటపడ్డారు. మరుక్షణమే నన్ను బలవంతంగా టాక్సీలో నెక్కించి టాక్సీవాడిని కోడంబాకంవైపు పోనివ్వమన్నారు.

♦ ♦ ♦

మరునాడు___

వుదయం 7 గంటలు కావస్తోంది. నేనింకా నిద్ర లేవలేదు. మా పాపవచ్చి కొంతసేపు గోల చేసినమీదట లేవక తప్పిందిగాదు. కళ్లు తెరిచేసరికి పాప కొండ ఎక్కినంత ఆనందపడుతూ 'పేపరు వచ్చింది' అంటూ పేపరు తెచ్చి నాకందించింది. ఆవులిస్తూ పేపరు తెరిచాను. ఎదురుగా ఫ్రంట్ పేజీలో ఒక ఫొటో నాకళ్ళకు కన్పించింది. అది చూడగనే గుండె ఆగినట్లన్పించింది. ఎవరో సుత్తితో నెత్తిన గట్టిగా బాదినట్లయింది. తెరచిన నోరు తెరచినట్లనే వుండిపోయింది.

ఆతురతగా మంచంమీదున్న పాపను క్రిందికి దింపి, లేచి కూర్చున్నాను. ఆ ఫొటోను పరికించిచూసాను. సందేహం లేదు. సరిగ్గా అక్షరాల అతనే! ఎవరినయితే తానంతతానుగా వచ్చి సహాయంకోరితే తప్పుగా అర్ధం చేసుకొని అవమానించామో అతను. ఆనాటి నా అవస్తతకి క్షమాపణ కోరదామనుకొని ఎవరిదగ్గరికి వెళ్ళాలనుకొని వెళ్ళలేకపోయానో! అతను!! పాతదృశ్యాలన్నీ సినిమా రీల్సల్లా కళ్ళకు కట్టినట్లు కనిపించాయి. మనస్సు వికలమయింది. నేత్రాలనుండి అశ్రువులు రాలి పేపరుపై పడి 'టప టప'మని శబ్ధంచేశాయి. ఆశబ్ధానికి మళ్ళీ యీ లోకంలోకి వచ్చాను. గబగబ కళ్ళు తుడుచుకొని, అతన్నిగురించి తెల్సుకోవాలన్న ఆతురతకొద్దీ పేపరు తీసాను చదువుదామని.

'సెంట్రల్ స్టేషన్‌దగ్గర నిరుద్యోగి ఆత్మహత్య.'

మద్రాసు:_'నిన్నరాత్రి 8 గంటలకు ఇరవై రెండేళ్ళ వయస్సుగల చలపతిరావు అనే యువకుడు పబ్లిక్ లారీ క్రిందపడి ఆత్మహత్య చేసుకొన్నాడు. అతన్ని మౌంటు రోడ్ హాస్పిటలుకి తీస్కెడుతుండగా దారిలో ప్రాణం పోయింది. అతనిజేబులో ఒక వుత్తరం దొరికింది. దాన్ని యథాతథంగా యీ దిగువుగ ప్రచురిస్తున్నాం.'

'...నా మరణానికి ఎవరూ కారకులు గారు. నేనే కావాలని ఆత్మహత్య చేస్కున్నాను. ఎందుకు చేసుకున్నానంటారు? నాకు, వ్యక్తి విలువలని గుర్తించలేని స్వలాభాలతో నిండిన యీ కుళ్ళు ప్రపంచంలో బ్రతుకు దుర్భరమనిపించింది, నాకేమిటి? నాపరిస్థితి బావున్న ప్రతివాడికీ అలాగే అన్పిస్తుంది. నాకథంతా చెప్పి మిమ్మల్ని బాధపెట్టడం నాకిష్టంలేదు. కానీ చెప్పకపోతే చేయరాని తప్పుచేసి పిరికివాడినై ఆత్మహత్య చేసుకున్నానంటారేమోనని చెప్పవలసివస్తోంది...'

'...మాది విజయవాడ ప్రాంతంలో ఒక పల్లెటూరు. మా తల్లిదండ్రులకు నేను ఏకైక సంతానం. అందుచేత కొంతవరకూ గారాబంగా నే పెంచబడ్డాను. వున్నదికొద్ది ఆస్తే అయినా నాకు ఏది కావాలంటే అది సమకూర్చేవారు మావాళ్లు. నేనంటే ఎంతో ప్రేమ. నన్నెంతో వాడిని చేసెయ్యాలని వారి ఆశ. అంచేత ఆరేళ్లు రాగనే స్కూలులో వేసారు. నాకు మొదటిలో చదువంటే అంత యిష్టం లేకపోయినా రానురాను శ్రద్ధ ఎక్కువై బాగా చదువుకోడం ప్రారంభించాను. ప్రతి సంవత్సరం ప్యాసవుతూ హైస్కూలులో చేరాను.

'స్కూలు ఫైనల్' పాసయ్యాను. అంతటితో ఆపి

ఏదన్నా వుద్యోగం చేస్తానన్నాను. కానీ మావాళ్లు అలా అంగీకరించక కాలేజిలో చేరమని ఒత్తిడి చేశారు. నాకంతగా యిష్టం లేకపోయినా తప్పిందిగాదు. ఎలాగో 4 సం॥ కష్టపడి డిగ్రీ అందుకున్నాను. కానీ వున్న ఆస్తి కాస్తా అయిపోయింది. 'అప్పుచేసి పప్పుకూడు' అన్నట్లు అప్పుచేసి కాలం గడుపుతున్నాం. నేను కన్పించిన వుద్యోగానికల్లా 'అప్లయి' చేస్తూవచ్చాను. కానీ ఒక్కదానికీ 'రిప్లై' వచ్చినపాపాన పోలేదు.

ఒకరోజు ఒక పెద్దమనిషి 'ఉడుత వూపులకు చింతకాయలు ఎట్లా రాలవో, అట్లాగే పిటిషన్లకు వుద్యోగాలు రావు. నీవు మద్రాసుకు వెళ్ళి స్వయంగా ప్రయత్నించు. ఏదో ఒకటి దొరుకుతుంది' అన్నాడు. ఆ మరునాడే బయలుదేరి యీ మద్రాసు మహానగరం వచ్చాను. వచ్చినదగ్గర్నుండీ చెప్పులకు బలపాలుకట్టుక తిరిగాను, అవి అరిగిపోయాయిగానీ వుద్యోగం లభించేలక్షణాలు కన్పించలేదు. కన్పించిన ఆఫీసుల్లో పనిచేసేవారినందర్నీ అడిగాను వాళ్ళవాళ్ళ ఆఫీసులలో ఖాళీలు ఏమయినా వున్నాయేమోనని. కొందరు సమాధానమిచ్చేవారు. కొందరు ఆఫీసర్లఫోజుపెట్టి పైకి చూసేవారు. నన్ను బిచ్చగాడిగాభావించి ఛీపొమ్మని తరిమినవారు కొద్దిగ గూడా లేకపోలేదు. తర్వాత ఎంప్లాయిమెంటు ఎక్స్ఛేంజిచుట్టూ తిరగగా తిరగగా రెండుమూడుచోట్లకు ఇంటర్వ్యూ కార్డులిచ్చాడు. కానీ ఏం ప్రయోజనం? ఒకచోట మినిష్టర్‌గారి చుట్టం, మరొకచోట ఆఫీసర్‌గారబ్బాయి, యింకోచోట ఎం. ఎల్. ఎ. గారి స్నేహితుడు అడ్డుపడి నా ఆశలను మొదలంటూ అణిచేశారు. ఇది ఇలావుండగా 'మీ నాన్న ఆరోగ్యం బాగలేదు' అని ఒకదినం ఉత్తరం—'మీ నాన్న చనిపోయారు' అని మర్నాడు టెలిగ్రాం వచ్చాయి. గోరుచుట్టుమీద రోకటిపోటయింది నా పరిస్థితి.

ఇంటికి వెళ్లాను. నాన్నగారి మరణానికి కారణం తగిన మందులు వాడకపోవడమేనని నాకు తెలిసింది. బాధపడ్డాను. అంతకంటె ఏం చెయ్యలేను గనుక. అన్ని ఖర్మకాండలు పూర్తయినతరువాత 'మంచిరోజులు రాకపోతాయా?' అని ఆశతో వున్న ఇంటిస్థలం అమ్మివేసి అందులో అమ్మకు కొంత యిచ్చి, కొంత నేను తీసుకొని తిరిగి మద్రాసు వచ్చాను.

మళ్ళీవచ్చి నెలయింది. కానీ దినాలు మారలేదు. మళ్లా నిన్ననే నిన్ననే మరో ఉత్తరం వచ్చింది. అమ్మ ఆరోగ్యం బాగాలేదట. ఎలా వుంటుంది? ఎన్నో ఆశలు పెట్టుకుని వూహాసౌధాలు నిర్మించుకున్న తల్లి తనకొడుకు అధోగతిలో అలమటిస్తున్నాడని తెలిసిగూడా ఎలా సుఖపడుతుంది! ఎందుకో యీవార్త నాకు చాలా భయం కలిగించింది. అమ్మను బ్రతికించుకోలేనన్నే భయం, నిరాశ నిస్పృహ కలిగాయి. యింకా కొద్దిరోజులుంటే అమ్మ మరణవార్తవిని బాధపడక తప్పదనే విపరీతభయం కలిగింది. ఆభయంకరవార్తవిని బాధతో కృంగిపోవడంకంటే మరణమే మంచిదనిపించి, యీపాపాని కొడిగట్టాను. అంతే!...నన్నుగురించి మీరేమనుకున్నా సరే! నా వుపయోగంలేని కథంతా చెప్పి బాధ గలిగించాను. అందుకు నన్ను క్షమిస్తారని ఆశిస్తూ సెలవు తీసుకుంటున్న......

...'చలపతి'

చదవడం అయిపోయింది. ఒళ్ళంతా ముచ్చెమటలు పోసాయి. హృదయం బరువుతో మూలిగింది. మనసులో బాధ మిగిలింది. కొందరి స్వలాభాలు. అధికార దుర్వినియోగాలు, మరికొందరి అర్థంలేని మూర్ఖత్వం మొదలైన వాటికారణంగా ఒక నిండుప్రాణం ఆత్మహత్య చేసుకోవాలసిన గతి ఏర్పడినందుకు బాధపడ్డాను. ఆనాటి నా ఆశ కత గుర్తొచ్చి శూలంలా గ్రుచ్చింది. బాధతో కళ్ళవెంట నీళ్లు బొటబొట కారాయి. ఆ నిరుద్యోగి కన్నీటి కథ చదివి కన్నీరు గార్చడంతప్ప నేనేమి చేయగలను?

---

## కల్చరల్ ఆర్ట్సు సెంటర్

రాజమండ్రి కల్చరల్ ఆర్ట్సు సెంటర్ సప్తమ నాటిక-నాటకపోటీలు 1971 ఫిబ్రవరినెలలో 18, 19, 20, 21 తేదీలలో జరుగుతాయి. యీసంవత్సరం నగదు బహుమతుల విలువపెంచి ఉత్తమ నాటకప్రదర్శనకు రు. 1116 లు, ద్వితీయ ప్రదర్శనకు రు. 558 లు, ఉత్తమ నాటికకు రు. 416 లు, ద్వితీయ ప్రదర్శనకు రు. 216 లున్నూ, రచయితలను ప్రోత్సహించే ఉద్దేశంతో ఉత్తమ నాటక రచనకు రు. 216 లున్నూ, ఉత్తమ నాటిక రచనకు రు. 116 లున్నూ. విజేతలైన కళాకారులకు రోలింగు బహుమతులు, శాశ్వత రజిత ట్రోఫీలు బహూకరించబడతాయి. సుప్రసిద్ధ కళావేత్తలు, కళాకారులతో వివిధ నాటక ప్రక్రియలపై గోష్ఠులు ఏర్పరచబడినాయి, ప్రముఖ చలనచిత్ర దర్శకులు, కళాకారులు యీ ఉత్సవములలో పాల్గొంటారు. ఆంధ్ర, ఆంధ్రేతర నాటక సమాజములు ఈపోటీలలో పాల్గొననవలసిందిగా అభ్యర్థిస్తున్నాం. దరఖాస్తుఫారములకు ఆఖరిగడువు డిశంబరు 15 వ తేదీ, ఇతర వివరములకు: కార్యదర్శి, కల్చరల్ ఆర్ట్సు సెంటర్, రాజమండ్రి-1. అడ్రస్‌కి వ్రాయకోరుతున్నారు,